సిఆర్‌టిల నియామకానికి ఉత్తర్వులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈ విద్యా సంవత్సరానికి సిఆర్‌టిల నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టిరమేష్, ఎస్‌మురళీమోహనరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు రెసిడెన్సియల్ టీచర్స్ (సిఆర్‌టి)లుగా పనిచేస్తున్న 1770 మందికి ఈనెల నుంచి 2024 ఏప్రిల్ 30వరకూ సేవలను పునరుద్ధరించారని, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను అకడమిక్ క్లాస్‌వర్క్, అడ్మినిస్ట్రేటివ్ పనులు సజావుగా సాగేందుకు యుటిఎఫ్ ప్రాతినిధ్యం మేరకు ఈ ఉత్తర్వులు విడుదల చేసినట్లు నాయకులు తెలిపారు. సిఆర్‌టిల రెన్యువల్ కోసం అధికారులు చర్యలు ప్రారంభించాలని, కౌన్సిలింగ్ విధానం ద్వారా నియామకాలు చేపట్టాలని కోరారు. సిఆర్‌టిలందర్నీ రెగ్యులరైజ్ చేయాలని ఉద్యమ కార్యాచరణ ఈ నెల 11న సుందరయ్య భవనంలో సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి ప్రతి సిఆర్‌టి హాజరు కావాలని వారు కోరారు.

అమ్మకానికి ఆర్అండ్ఆర్ భూమి

కీలక పాత్ర పోషిస్తున్న రెవెన్యూ సిబ్బంది?

గుణానుపురంలో ప్లాట్లు వేసిన నిర్వాసితుల భూమి

ప్రజాశక్తి - కొమరాడ

తోటపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల పునరావాసం కోసం ప్రభుత్వం సేకరించిన భూమి గుట్టుచప్పుడుగా క్రయ విక్రయాలు జరిగిపోతుంది .ఈ వ్యవహారంలో మండల రెవెన్యూశాఖే కీలక పాత్ర పోషిస్తున్నాయని, అక్రమార్కులపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు ముడుపులు తీసుకొని తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

తోటపల్లి జలాశయం ముంపు గ్రామాల్లో ఒకటి గుణానుపురం. ఇక్కడి నిర్వాసితులకు ఈ గ్రామంలో రోడ్డుకు ఆనుకొని సుమారు ఎకరా 56 సెంట్లు భూమిని ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఆర్అండ్ ఆర్ కింద భూసేకరణ చేసింది. ఆ భూమి గల సదరు వ్యక్తికి కూడా ప్రభుత్వం పరిహారం చెల్లించింది. దీంతో ఆ భూమిని సదర వ్యక్తి ప్రభుత్వానికే వదిలేశాడు. అంత వరకూ బాగానే ఉంది. అయితే అప్పట్లో మాన్యువల్ కావడంతో సర్వే నెంబరులో చిన్న తప్పిదం జరిగింది. ఆ భూమికి బదులు వేరేచోట ఉన్న భూమి సర్వే నెంబరు ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది అక్రమార్కులు ఆ భూమి పాతవారి పేరునే ఇంకా ఉండడంతో దాన్ని చదువు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం రాళ్లు కూడా పాతేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కబ్జాదారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. 194, 193 సర్వే నెంబర్లో గల ఈ భూమిని ప్రస్తుతం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల పేరున ఆన్లైన్లో ఉండడంతో ఆ భూమి తమ జిరాయితీ అంటూ వారికి నచ్చినట్లు అమ్మకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా రెవెన్యూ సిబ్బంది, అధికారుల కనుసన్నలోనే జరుగుతున్నట్లు గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయంపై అప్పట్లో తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణకు ఫిర్యాదు రావడంతో గ్రామంలో పర్యటించి పలు వివరాలు తెలుసుకున్నారు. పర్యటించి నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడంతో అధికారులు, కబ్జాదారులు ఒక్కటైపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లో అమ్మకాలకు వెళ్లడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు గుణానుపురం గ్రామంలో ఎంత భూమి భూసేకరణ చేశారు, ఇప్పుడు ఉన్న భూమి ఎంత అన్న లెక్కలు తెలిస్తే అక్రమార్కులకు అడ్డుకట్ట వేయచ్చని గ్రామస్తులు అంటున్నారు. భూ అక్రమార్కులు రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పతో అధికారులు పట్టించుకోవడంలేదని దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ప్రజలు అంటున్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు, తోటపల్లి జలాశయం భూ సేకరణ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు.

ఈ విషయంపై తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ వివరణ కోరగా గుణానుపురంలో తోటపల్లి జలాశయం పునరావాసం ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమి వివరాలను రికార్డులు పరిశీలించి విచారణ చేపడతామన్నారు. అనంతరం ప్రభుత్వ భూమిగా ధ్రువీకరణ అయితే తక్షణమే ఆ భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - భామిని

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్లో స్వల్ప తేడాలు గమనించిన జిల్లా కలెక్టర్ ఇకపై రికార్డుల నమోదు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఇకపై ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది హాజరులో భాగంగా జూనియర్ అసిస్టెంట్ శశికాంత్ బహుదూర్ గురించి వాకాబు చేయగా ట్రెజరరీ ఆఫీసుకు వెళ్లారని తెలియజేయగా, ట్రెజరరీ ఆఫీసుకు ఫోన్‌లో వివరాలు అడిగారు. హాస్పటల్ సిబ్బంది ఎవరూ ట్రెజరీకి రాలేదని నిర్ధారించడంతో జీతం నిలుపుదల చేయాలని అధికారులను ఆదేశించారు. నైట్ వాచ్‌మాన్ వెంకటరావు గత 8 మసాల నుంచి విధులకు రాకపోవడం గమనించిన కలెక్టర్ తగిన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత 6 నెలలుగా 15 మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడానికి గల కారణాలను ప్రశ్నించారు. శానిటేషన్, ఆపరేషన్ గది, ఓపి కార్డులను పరిశీలించారు. ప్రతి శుక్రవారం ప్రభుత్వం నిర్దేశించిన గ్రామాలకు శానిటేషన్ చేయాల్సి ఉండగా ఇంతవరకు ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. గత 6 మాసాలకు కేవలం 15 ప్రసవాలు జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలా జరగకుండా చూసుకోవాలని డాక్టరు రవీంద్రను హెచ్చరించారు. ఆసుపత్రి ప్రసవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రసవ తేదీలను తెలియజేసి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన వారిపై పౌష్టికాహారం గూర్చి తెలియజేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టరు వైద్య ఆరోగ్య సేవలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అంటు వ్యాధులు, బిపి, మధుమేహం వంటి వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. రానున్న వర్షాకాలంలో దోమలు ఎక్కువగా ప్రభల కుండా స్ప్రేయింగ్ పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు.

ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాఠశాల పనులు వేగవంతం చేయాలి

నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాల భవనాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిపై కలెక్టర్‌కు వివరణ

మండలంలోని పసుకుడి నుంచి బత్తిలి వరకు ప్రధాన రహదారి గోతులతో, చిన్న వాన పడ్డా రహదారి బురదమయంగా మారి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మీరు బత్తిలి నుంచి భామిని ఏకలవ్య పాఠశాల పరిశీలనకు ప్రధాన రహదారి గుండా వచ్చే క్రమంలో ఈ రోడ్డు దుస్థితి పరిశీలించి ఉంటారని అన్నారు. ప్రధాన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భామినిలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల పరిశీలనకు వచ్చిన కలెక్టర్ నిశంత్ కుమార్‌కు వివరణ ఇచ్చి, చర్యలు తీసుకోవాలని భామిని ఎంపిపి తోట సింహాచలం దరఖాస్తు అందజేశారు.

పులి పాదాలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

అమ్మో పులి

గుమడాం సమీప తోటలో ఆవుపై దాడి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఫారెస్ట్ రేంజ్ అధికారి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి సమీపంలో బాగువలస రూటులో ఉన్న ఆర్.రాంప్రసాద్ అనే రైతు పామాయిల్ తోటలో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. దీంతో గుమడాం పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి పామాయిల్ తోటలో ప్రవేశించి దాడి చేసి ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయాన్నే తోటలో చూసే సరికి ఆవు చనిపోయి వుండడం, పులి అడుగు జాడలు కనిపించడంతో రైతు రాం ప్రసాద్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీ రేంజ్ అధికారి కె.రామారావు తోటలో ఆవుపై దాడి చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఒంటరిగా తిరగొద్దని, రాత్రి వేళల్లో పశువుల పాక వద్ద పడుకోవద్దని సూచించారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఈ ప్రాంతంలో తిరగాలని కోరారు. అటవీ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పట్టణానికి సమీపంలో ఉన్న తోటలో పులి సంచారం కనిపించడంతో పట్టణ వాసుల ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

2022 డిసెంబర్ 31 వరకు విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడాన్ని సిఐటియు స్వాగతిసుతందని, అయితే కటాఫ్ డేట్‌ను 2014 జూన్‌కు బదులుగా, 2022 డిసెంబర్ 31 గా నిర్ణయించి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు కానీ అందుకు భిన్నంగా రూ.5 వేల నుండి రూ.10 వేలు తగ్గింపుతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు సవరిస్తూ జిఓ 7 విడుదల చేయడం దారుణమన్నారు. ఇది కూడా ముఖ్యమంత్రి హామీలకు భిన్నంగా ఉందన్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు 60 వేల మంది వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, పథకాలు, యూనివర్సిటీలలో పనిచేస్తున్నారని, ప్రభుత్వ నిర్ణయం వల్ల 7 నుంచి 8 వేల మంది కంటే మించి రెగ్యులర్ అయ్యే అవకాశం లేదని తెలిపారు. కావున పై అంశాలను మానవతా దృష్టితో పరిశీలించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అలాగే 2 లేదా 3 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారిని రెగ్యులరైజ్ చేసే అంశాన్ని పరిశీలించాలని, 1993కు ముందు నుంచి పనిచేస్తున్న టైంస్కేల్, డైలీవేజ్, కంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఐదేళ్ల కాంట్రాక్ట్ సర్వీసు పూర్తి అయ్యిన వెంటనే రెగ్యులర్ అయ్యే విధానాన్ని అమలు చేస్తూ నిర్దిష్ట ఉత్తర్వులు ఇవ్వాలని, రెగ్యులరైజేషన్‌లోగా రిటైర్ అవుతున్నఉద్యోగులకు పెన్షన్, రిట్మైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు డిఎతో కూడిన మినిమం టైంస్కేల్ అమలు చేయాలి. ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్‌లోకి మార్చాలి. కార్పొరేషన్‌లో రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలు, వేతనాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.20 వేలు అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమపథకాలు కొనసాగించాలని, కాంట్రాక్ట్, పార్ట్‌టైం వ్యవస్థను ఫుల్‌టైంగా మార్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, కార్యదర్శి బివి రమణ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మన్మధరావు

సీతానగరంలో అమృతసరోవర్ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు

అమృత సరోవర్ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో జరుగుతున్న ఉపాధిహామీ అమృతసరోవర్ చెరువుల పనులను శుక్రవారం ప్రత్యేక అధికారి డి.మల్లికార్జునరావు, డ్వామా పిడి రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాలగొడబ గ్రామచెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. గ్రామాల్లోని కోనేరులను సుందరీకరణ చేసిన పనుల పట్ల సంతప్తి వ్యక్తంచేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వేతనదారులు కూడా కొనేరుల అభివద్ధికి నిధులు మంజూరు చేసి సుందరీకరణ చేసిందునకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.కృష్ణుడు, ఎపిఒ నాగలక్ష్మి, జెఇ కూర్మారావు, సర్పంచ్ పండు పోలమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, కోటసీతారాంపురం, జానుమల్లువలస గ్రామాల్లోని ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అమృత సరోవర్ కొనేరులను ప్రత్యేకాధికారి డి.మల్లికార్జునరావు సందర్శించారు. గ్రామాల్లోని కోనేర్లను సుందరీకరణ చేసిన పనుల పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒ ప్రసాద్, ఎపిఒ భాను, జెఇ కృష్ణారావు, ఎంపిటిసి బురిడి కుసుమ కుమారి సూర్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు జానకి, లక్ష్మణలతో పాటు ఆయా గ్రామ పెద్దలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్నదొరను సన్మానిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

డిప్యూటీ సిఎంకు కాంట్రాక్టు ఉద్యోగుల సన్మానం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను నియోజకవర్గంలో గల కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. 2014 జూన్ నాటికి రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఎం జగన్ మోహన్ రెడ్డి నిర్ణయించడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీనిలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులు రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నాళ్ళుగానో వేచి చూస్తున్న నిరీక్షణ వైసిపి ప్రభుత్వం హయాంలో ఫలించిందన్నారు. అంతకుముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాలని టిడిపి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. వేలాదిమంది కాంట్రాక్టు ఉద్యోగుల పాలిటవరంలా సిఎం జగన్ నిర్ణయం మారిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు జిపిఎస్ విధానం ప్రయోజనకరమేనని చెప్పారు. ఆయన వెంట గిరిజన ఉద్యోగుల సంఘం ఎం.లచ్చయ్య వున్నారు.

కురుపాం :కురుపాం, గుమ్మలక్ష్మీపురం, చినమేరంగి కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తమను ప్రభుత్వం రెగ్యులర్ చేసి సందర్భంగా ఎమ్మెల్యే పాములు పుష్ప శ్రీవాణిని కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమను రెగ్యులర్ చేసిందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాచిపెంట ఎంపిడిఒగా పార్వతి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక మండల పరిషత్ అధికారిగా జి.పార్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సాలూరు ఎంపిడిఒగా పనిచేస్తూ పాచిపెంట ఇన్చార్జి ఎంపిడిఒ బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పని చేసిన ఎంపిడిఒ జి ఉమామహేశ్వరి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : పీడీ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వం దగ్గర వివిధ రూపంలో తీసుకున్న డబ్బుతో వ్యాపారం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి కిరణకుమార్ స్వయంసహాయక గ్రూపు మహిళలకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఎస్‌హెచ్‌జి అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో నాలుగు మహిళ మార్ట్ లు ఏర్పాటు చేశారని అన్నారు. వీరఘట్టం మండలంలో కూడా మీ అందరి సహకారంతో మహిళా మార్టు ఏర్పాటుకు ఒక్కొక్క సభ్యురాలి నుంచి రూ.200 మార్ట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మండలంలోని 1752 డ్వాక్రా సంఘాలకు గానూ 1244 సంఘాల నుంచి రూ.25 లక్షల 55,600 వసూలైందన్నారు. మిగిలిన 508 సంఘాల నుంచి నగదును వసూలు చేసి పది రోజుల్లో మార్ట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మార్కెట్ ధర కంటే రూ.5 తక్కువతో పాటు బ్రాండెడ్ సరుకులు అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది రూ.367.85 కోట్లతో బ్యాంకు లింకేజీల ద్వారా ఉన్నతికి రూ.ఐదు కోట్లు, శ్రీనిధికి రూ.72 కోట్లు ఇవ్వడానికి నిధులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శివున్నాయుడు, మహిళా మండలి అధ్యక్షులు పి.సుజాత, సిసిలు, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గెడ్డను కప్పేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గెడ్డలను కప్పేస్తున్న భూ అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు మరడాన సూరపు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో గెడ్డను ఆక్రమిస్తున్న ప్రదేశాన్ని గ్రామ పెద్దలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ, కొత్తవలస గ్రామాల నుంచి నాగావళి నది వరకు గల గెడ్డలో కొంతమంది అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి పోసి కబ్జా చేస్తున్నారని తెలిపారు. మరోవైపు గెడ్డ పక్కనున్న భూ యజమానులు గెడ్డను ఆక్రమించేందుకు మట్టి పోసి గెడ్డలో ఉన్న చెట్లను నరికి వేయడం దారుణమన్నారు. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో అక్రమార్కులు ఆశపడి కబ్జాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గెడ్డలు కబ్జా చేస్తే దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. గెడ్డ అక్రమాలపై రైతులతో కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు ఎం.సింహాచల ంనాయుడు మాట్లాడుతూ గెడ్డ సుమారుగా 30 అడుగుల వెడల్పు ఉండేదని, అయితే ఇది పక్కనున్న రైతులు గెడ్డను కబ్జా చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఈ విషయంపై గ్రామంలో రైతులతో మాట్లాడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకొనేలా ప్రయత్నిస్తు చేస్తామని తెలిపారు. దీంతో పాటు గ్రామ పెద్దలు సిరికి సింహాచలం తదితరులు ఉన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని అజ్జాడ - పి.చాకరపల్లి వరకూ నిర్మించనున్న బిటి రహదారిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.చాకిరాపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనతికాలంలోనే రూ.2.80 కోట్ల నిధులతో గ్రామానికి 4.5 కిలోమీటర్ల మేర బిటి రోడ్డు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామస్తుల చిరకాల కోర్కె నెరవేర్చి ఎమ్మెల్యేను గ్రామస్తులు అభినందించారు. ఈ మేరకు గ్రామంలో గుర్రంపై ఊరేగించారు. కార్యక్రమంలో మండల, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత ఉండాలి

పార్వతీపురం టౌన్ : నాణ్యత ప్రమాణాలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో 3వ వార్డు వివేకానంద కాలనీలో ఎమ్మెల్యే సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రూ.4.5 లక్షల నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ సువ్వాడ లావణ్య, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కన్వీనర్ ఎస్. చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బిసి సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానాలు భర్తీ చేయడానికి కురుపాం, సాలూరు, పార్వతీపురం పాఠశాలలకు గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ ఎం.పెంటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాలూరు బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో నాలుగు ఖాళీలు, పార్వతీపురం బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో 14, 9వ తరగతిలో రెండు, కురుపాం బాలురు పాఠశాలలో ఆరో తరగతిలో 24, 7వ తరగతిలో 8, 8వతరగతిలో 24, 9వ తరగతిలో 6ఖాళీలు ఉన్నాయని, వీటిలో ప్రవేశానికి రిజర్వేషన్లు అనుసరించి ఈనెల 18న జరిగే రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయబడతాయని, దరఖాస్తుకు ఆఖరు తేది ఈనెల15న అని ప్రకటనలో తెలిపారు.

కొట్టుగుమ్మడలో గడప గడపకూ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కొట్టు గుమ్మడ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకట రమణ నాయుడు, మాజీ సర్పంచ్ ఉదయాన సంధ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు కవిఎల్ ప్రసాదరావు, ఉదయాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఉచిత బీమా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జియ్యమ్మ వలస

వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ఉచితబీమాను అమలు చేస్తూ రైతన్నను ఆదుకుంటుందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని సుభద్రమ్మ వలసలో శుక్రవారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, అరటి పంటలను రైతులు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతే ప్రభుత్వం బీమా చెల్లిస్తుందని అన్నారు. గ్రామంలో బంకురులక్ష్మణకు ఉచితబీమా వల్ల రూ. 3 లక్షల వరకు పంట నష్ట పరిహారం అందడం ఆయనకు ఎంతో ఉయోగపడిందని అన్నారు. కార్యమంలో ఎం.శశికళ, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీ శంకర్రావు, స్థానిక ఎంపిటిసి సభ్యులు రెడ్ రవికుమార్, సర్పంచ్ రెడ్డి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు

చిన్నారులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ మాస్టర్ జి. మురళీ కృష్ణ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. శనివారం మట్టి తో బొమ్మల తయారు చేయడం వుంటుంది. పాల్గొన దలచిన వారు మట్టిని కూడా తీసుకుని రావాలి. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

వినతులపై ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి-సీతంపేట

గడప గడపకు కార్యక్రమాల్లో వచ్చిన వినతులపై స్థానిక వైటిసిలో శుక్రవారం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గడపగడప వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించాలన్నారు అక్కడ జరుగుతున్న పనులు ఆసక్తి ఉన్నవారు చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డిల్లీశ్వరరావు, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, జెఇలు కిరణ్,పవన్‌కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో వారం రోజులుగా తాగునీరందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో వర్షాలకు పాలకొండ- పార్వతీపురం రహదారి ఉల్లిభద్ర వద్ద పాడైపోవడంతో దాని మరమ్మతులు చేపట్టారు. ఈ సమయంలో డి. శిర్లాం వద్ద గల ప్రాజెక్ట్ నుంచి అడ్డాపుశీల, కొంకడవరం మరికొన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్న పైపులైనుకు రంధ్రాలు పడ్డాయి. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయమై అధికారులకు తీసుకెళ్లినా పట్టించుకోలేదని సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మీ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోయిన పైపులైనుకు మరమ్మతులు చేసి గ్రామస్తుల దాహార్తిని తీర్చాలని కోరారు.

లేఅవుట్‌పై అభ్యంతరాలుంటే తెలపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

లేఅవుట్‌పై అభ్యంతరాలుంటే తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నోటీసు బోర్డులో లేఅవుట్‌కు సంబంధించిన పత్రాలను టిపిఒ పి.కనకారావు, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ జి.వినయ్, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటేరియలతో కలిసి ప్రచురించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో బెలగాం రెవెన్యూ విలేజ్ సర్వే నెంబరు 556/పి నందు గల 3.95 విస్తీర్ణం గల స్థలంలో అనధికారంగా వేయబడిన 71 ప్లాట్లతో కూడిన లేఅవుట్‌పై ఎటువంటి అభ్యంతరాలున్న 15 రోజుల్లో లిఖిత పూరకంగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో నిలిచిన గుడి తొలగింపు పనులు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి చొరవతో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో ఉన్న గుడిని తొలగించే పనుల ప్రక్రియను ఆర్టీసీ అధికారులు విరమించుకున్నారు. ఆర్టీసీ అధికారులు త్రిమూర్తుల గుడిని నేలమట్టం చేయడానికి ప్రయత్నిస్తున్నారనయ్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. గుడిని నేలమట్టం చేస్తే గ్రామస్తులతో కలిసి అక్కడే బైఠాయించి నిరసన తెలపడానికి కూడా వెనకాడనని హెచ్చరించారు. తమ మనోభావాలను అర్థం చేసుకుని తోడుగా, అండగా నిలబడిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా నాయకులు పరీక్షిత్ రాజుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : డిపిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. స్వమిత్ర సర్వే, ఫీవర్ వెరిఫికేషన్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, హౌస్ టాక్స్, ఒడిఎఫ్ తదితర అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.జయంత్ ప్రసాద్, మండల పరిషత్తు ఎఒ వై.వెంకటరమణ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

భూఅభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండిలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం సందర్శించారు. పనులు మస్తర్లు తనిఖీలు చేపట్టారు. పేదలందరికీ జాబ్ కార్డులో సరఫరా చేయాలన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స బాక్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కూలి గిట్టిబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ బాబురావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ, కార్పొరేషన్లల్లో పని చేస్తున్న కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ అధికారి, సబ్ ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్సు బకాయిలు విడుదల చేయాలని కోరారు.

16, 17 తేదీల్లో గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాచిపెంట

ఈనెల 16,17 తేదీల్లో ఎపి గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభలు కురుపాంలో జరుగుతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని సంఘం నాయకులు సూకూరు అప్పలస్వామి, కొర్ర కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు పాచిపెంటలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బొడ్డ స్వాములు, తవుడు, గిమెల భీమా, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు

బోగస్ ఎస్‌టి కుల ధ్రువపత్రాలపై విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల బోగస్ ఎస్‌టి కుల ధ్రువపత్రాలపై శుక్రవారం ఐటిడిఎలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మండలంలోని కొత్త పనుకువలసకు చెందిన కిల్లోల మాధవరావు, గోయిది గ్రామానికి చెందిన కొండ గౌరై శ్రీనివాసరావుపై ఫిర్యాదులు వచ్చారు. ఈ మేరకు డిడి బి.నగేష్, ఎపిఒ రోషి రెడ్డి, సిబిసిఐ డిఎస్‌పి ఎం.నాగేంద్ర గోపాల్ విచారణ చేపట్టారు. విచారణలో తహశీల్దార్ సూరి నరసింహమూర్తి, సూపరింటెండెంట్ దేశ్, శ్రీకాకుళం డిటి తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల రెన్యువల్ ఉత్తర్వుల పట్ల హర్షం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1770మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీ)ను రెన్యువల్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రెన్యువల్ ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం మహిళా సిఆర్టీలను నియమించాలని డిమాండ్ చేశారు.

రైతులు ఇబ్బంది పడితే అధికారులదే బాధ్యత

ప్రజాశక్తి- వీరఘట్టం

విత్తనాల పంపిణీల విషయంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడిన దానికి బాధ్యులు వ్యవసాయ అధికారులేనని స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో విత్తనాల కోసం రైతులు ధర్నాలు, నిరసనలు , క్యూ కట్టడం వంటివి జరిగేవని,ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు గడపకే విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒకవేళ ఆ పరిస్థితి వస్తే ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారులకు సూచించారు . బ్లాక్ మార్కెట్లు విత్తనాలు అధిక రేట్లకు విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని స్థానిక వ్యాపారులకు హెచ్చరించారు. ప్రధానమంత్రి కిసాన్ పథకానికి సంబంధించి ఎవరైనా ఇకెవైసి చేయించుకోకపోతే అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు కెవిఎల్ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఎంపిడిఒ జయంత్‌ప్రసాద్, ఎఒ జక్కువ సౌజన్య, మండల విస్తీర్ణ అధికారి బి.కృష్ణకాంత్, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ బి.రాజు గ్రామ యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని, రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. శుక్రవారం కురుపాం రైతు భరోసా కేంద్రం వద్ద ఎడిఎ అలజంగి నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. తొలుత మండలం వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలానికి జనరల్ విత్తనాలు109 క్వింటాలు, గిరిజన రైతులకు 90శాతం రాయితీ విత్తనాలు 1200 క్వింటాలు, మొత్తం 1309 క్వింటాలు ఇండెంట్ ఇవ్వగా 1193 క్వింటాళ్లు ఇచ్చారని, పచ్చి రొట్ట విత్తనాలు 59 క్వింటాలు ఇండెంట్ ఇవ్వగా 40 క్వింటాళ్లు 185 టన్నుల వివిధ ఎరువులు ఇండెంట్ ఇవ్వగా 121 టన్నులు వచ్చాయని ఇవన్నీ మండలంలో గల ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అనంతరం ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ రైతులందరికీ సకాలంలో విత్తనాలు, ఎరువుల అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు వహించాలని అన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు జి.సుజాత, పిఎసిఎస్ చైర్మన్ కె.గౌరీశంకర్, సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : ఖరీఫ్‌కు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎఒ ఎస్.అవినాష్ అన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గుర్తింపు కార్డులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. తహశీల్దార్ ఎంవి రమణ మాట్లాడుతూ రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి వెంటనే మంజూరు చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు వస్తే వారికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రవణమ్మ, ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, వైస్ఎంపిపి టి సూర్యనారాయణ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలోని గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో భాగంగా గిరిజన రైతులకు వరి ధాన్యం, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులేని పంటలను పండించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండడానికి వీలుంటుందన్నారు. ప్రకతి వ్యవసాయం చేయడం ద్వారా మన భూమిని రక్షించే భవిష్యత్తు తరాలకు అందించిన వారం అవుతామన్నారు. ప్రతి గ్రామంల ప్రకృతి వ్యవసాయం పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం 90శాతం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల బీమా పథకం, ఐటిడిఎ ద్వారా సబ్సిడీపై ఇస్తున్న వ్యవసాయ యాంత్రిక పనిముట్లు గిరిజన రైతులు వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న రైతులకు 1128 క్వింటాళ్ల వరి విత్తనాలు, 80 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కురుపాం :రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపిపి పద్మావతి

విత్తన విక్రయ కేంద్రం ప్రారంభం

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం రైతు ఉత్పత్తి దారుల సంఘం ఎఫ్‌బిఒ ఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మార్ నగరంలో విత్తన విక్రయ కేంద్రం స్థానిక సర్పంచి వంగపండు లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎం కొవ్వల సురేష్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంఘాల ద్వారా ఎరువులు విత్తనాలు పురుగుల మందులతోపాటు వ్యవసాయ పరికరాలు విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట ఎమ్మార్ నగరంలో విత్తన విక్రయ కేంద్రం ప్రారంభించామని, త్వరలోనే మండలంలో డిమాండ్ ఉన్నచోట ఈ కేంద్రాలు ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎఫ్‌పిఒ సంఘ అధ్యక్షులు వంగపండు త్రినాధ నాయుడు, అఖిలభారత రైతు కూలీ సంఘం కార్యదర్శి నరసింగరావు రైతులు పాల్గొన్నారు.

గడ్డి పిక్కల పత్తి, కలుపు మందు నిషేధం

పాచిపెంట : గడ్డి పిక్కల పత్తిపై ప్రభుత్వం నిషేధం విధించిందని, దీన్ని విక్రయించినా, నాటినా శిక్షార్హులని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని కొటికపెంట రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రకృతి సేద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని, గడ్డిపిక్కల పత్తి పర్యావరణాన్ని పాడు చేయడమే కాకుండా అధిక వర్షాలకు తట్టుకొని నిలబడలేదని అన్నారు. ఎవరైనా అమ్మినట్లు రుజువైతే చట్ట ప్రకారం నాన్ బెయిలబుల్ కేసుగా పరిగణిస్తారని తెలిపారు. అలాగే గ్లైఫోసైట్ కలుపు మందు మనుషుల ఆరోగ్యానికి హానికరమన్నారు. మార్కెట్లో గ్లైఫ్ సెట్ విక్రయాలపై కూడా నిఘా ఉంచాలని ఎవరైనా అమ్మినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని అన్నారు. అనంతరం కషాయాల తయారీని పి.కోనవలస ఆర్‌బికెలకు రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సిబ్బంది, ఎఇఒ రెడ్డి హైమావతి పాల్గొన్నారు.

తాడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మలేరియా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం.బుద్దేశ్వరరావు కోరారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ శుక్రవారం తాడికొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, మలేరియా బారిన ప్రజలు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మనం తీసుకునే జాగ్రత్తలు వల్ల మనకు వ్యాధులు ఎక్కువగా ప్రభలే అవకాశం ఉండదని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాను మలేరియా లేని జిల్లాగా మార్చాలని ఆయన తెలిపారు. ర్యాలీలో సూపర్వైజర్ శ్రీను, సింహాచలం, వైద్య సిబ్బంది నిమ్మకూరి రత్న ప్రసాదరావు, ఎస్‌వి ప్రకాష్, రమేష్, ఎం.ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

గర్భిణుల పట్ల సేవా భావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణుల ఆరోగ్యం పట్ల సేవా భావంతో సిబ్బంది పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని కెఆర్‌బి పురం, కొమరాడ పిహెచ్‌సిల్లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పిఎంఎస్‌ఎంఎ) కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించారు. గర్భిణీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు నిశితంగా పరిశీలించారు. ఈ మేరకు గిరి శిఖర గ్రామాల నుంచి వైద్య సిబ్బంది తీసుకొచ్చిన గర్భిణులతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడి ప్రతి ఒక్కరి ఆరోగ్యం పరిశీలించి వీరిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య తనిఖీల వివరాలు మాతా శిశు సంరక్షణ కార్డులో విధిగా నమోదు చేయాలన్నారు. ల్యాబ్ సిబ్బంది గర్భిణీలకు నిర్వహించే హిమోగ్లోబిన్, సుగరు పరీక్షలు దగ్గరుండి పరిశీలించారు. నివేదికలు గర్భిణీలు ఆరోగ్య స్థితికి సరిపడి ఉన్నాయా పరిశీలించారు. పిఎంఎస్ంఎ రికార్డులు పరిశీలించి హైరిస్క్ గర్భిణీ గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సాధారణ ప్రసవాలు, ఆసుపత్రి ప్రసవాలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటున్నదీ, లేనిదీ వైద్య సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.శామ్యూల్ జాన్, డాక్టర్ సిహెచ్.అరుణ్ కుమార్ నాయుడు, సిహెచ్ఒ బంగారుబాబు, సూపర్ వైజర్లు విజయ కుమారి, సాయమ్మ, కృష్ణ శారద, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : గర్భిణికి వైద్యపరీక్ష చేస్తున్న వైద్యాధికారి శిరీష

సీతానగరం : గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి కె.శిరీష అన్నారు. శుక్రవారం గర్భిణీలకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా గర్భిణులు తనిఖీలు నిర్వహించుకోవాలన్నారు. రక్తహీనత ఉండే వారికి ప్రత్యేకమైన మందులిచ్చి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరగాలన్నారు. అలాగే పెద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాధాకాంత్ ఆధ్వర్యంలో గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌విలు బి.సత్యవతి, వరలక్ష్మి, ఎఎన్‌ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

మురుగునీటికి దారిలేని జగనన్న కాలనీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని తూరుమామిడిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ మురుగు నీరు పోవడానికి దారి లేదు. ఈ గ్రామానికి చెందిన మచ్చ తిరుపతిరావు స్థలంలోకి ఆయన అనుమతి లేకుండా జగనన్న కాలనీ మురుగు పోవడానికి గృహనిర్మాణ శాఖ అధికారులు ఆరు అడుగుల వెడల్పుతో కాలువ తవ్వారు. ఆ కాలువ తన అనుమతి లేకుండా తన జిరాయితీ పొలం మీదుగా ఇవ్వడం వల్ల తనకు నష్టం జరిగిందని ఆయన సిపిఎం నాయకులు కొల్లి గంగు నాయుడుతో కలిసి తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అపంతనం గంగునాయుడు మాట్లాడుతూ తూరుమామిడి జగనన్న కాలనీ భద్రతా ఏర్పాట్లు లేకుండా నిర్మిస్తున్నారన్నారు. మురుగు నీరు పోవడానికి ఏర్పాట్లు లేకుండా తిరుపతి రావు జిరాయితీ భూమి మీదుగా కాలువ తవ్వారని, రైతు అనుమతి లేకుండా గ్రామ సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు దౌర్జన్యంగా కాలువ నిర్మాణం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇది దుర్మార్గమని అన్నారు. ఈ కాలనీ నిర్మాణంలో అన్నీ తప్పులు తడకలేనన్నారు. జగనన్న కాలనీ నిర్మిస్తున్న భూమి అమ్మకాల్లో సర్పంచ్ లక్షల రూపాయలు అవినీతికి పాల్పడ్డాడని, ఈ విషయమై సాక్షాత్తు సిఎం జగన్ మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా కనీసం రెవెన్యూ అధికారులు విచారణ కూడా చేయలేదని అన్నారు. మచ్చ తిరుపతి రావు స్థలం మీదుగా చేపడుతున్న కాలువ పనులు ఆపాలని, తూరుమామిడి జగనన్న కాలనీ అవినీతిపై సమగ్ర విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన సర్పంచ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కాలనీకి తీసుకున్న నష్టపరిహారం డబ్బు తిరిగి కట్టించాలని డిమాండ్ చేశారు.

ఈ ఏడాదీ కదల్లేని స్థితిలో జగన్నాథ రథచక్రాలు

జిల్లా దేవాదాయ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన జగన్నాథ స్వామికి జరిగే రథయాత్ర ఆచార, సాంప్రదాయాలు కనుమరుగైపోయే పరిస్థితి కనిపిస్తుందని ఆలయ పురోహితులు, పట్టణ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కోవిడ్ పరిస్థితుల ప్రభావంతో రెండేళ్లు రథయాత్ర జరగలేదు. అయితే గత ఏడాది కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ అధికారులు జగన్నాథ రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ రెండేళ్లుగా జగన్నాథ స్వామి రథం మూలన పడి ఉండడంతో రథం మరమ్మతులకు గురై ధ్వంసమైంది. అయితే గత ఏడాది రథాన్ని తయారు చేసేందుకు దాతలు ముందుకు వచ్చినప్పటికీ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవకపోవడంతో పట్టణంలో పాత బస్టాండ్ వద్ద ఉన్న జగన్నాథ స్వామి ఆలయము నుండి గుడి మండపం వరకు రథం మీద తీసుకువెళ్లే జగన్నాథ స్వామి, బలరామస్వామి సుభద్ర దేవి, లక్ష్మీదేవి విగ్రహాలను ట్రాక్టర్‌పై తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ విషయంపై జిల్లా దేవాదాయ శాఖ అధికారులను పలువురు ప్రశ్నించినప్పటికీ సమయాభావం లేక రథాన్ని తయారు చేయలేదని, వచ్చే ఏడాది తప్ప కుండా సిద్ధం చేస్తామని దాటవేశారు. అయితే ఈనెల 20న రథయాత్ర జరగాల్సి ఉంది కానీ రథాన్ని సిద్ధం చేయలేదు. ఏడాది అయినప్పటికీ జిల్లా దేవాలయ శాఖ అధికారులు జగన్నాథ స్వామి రథం తయారు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుందని పట్టణ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

శిథిలమైన రథం

చురుగ్గా ట్రాన్స్‌ఫార్మర్ పనులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఇటీవల కాలంలో గాలి, వానలకు దెబ్బతిన్న 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో తోటపల్లి కుడి ప్రధాన కాలువ గేట్లు ఎత్తివేతకు ఆటంకాలు తొలగనున్నాయి. ఖరీఫ్ సీజన్ దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ కాలువ ద్వారా ఈ ఏడాది 85 వేల ఎకరాలకు సాగు నీరు అందజేస్తామని ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 12న కుడిప్రధాన కాలువ నీరు విడుదలకు సిద్ధంగా ఉందని తెలిపారు. తోటపల్లి నుంచి చీపురుపల్లి వరకు గల రైతులకు ఈ కాలువ ద్వారా సాగునీరందుతుందన్నారు.

పశు బీమాపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

వైఎస్ఆర్ పశు బీమాపై గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించాలని పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎడి కార్యాలయంలో వెటర్ని సిబ్బందికి సచివాలయ వెటర్నరీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవులకు రూ.30వేలు ప్రీమియం ఉంటే ప్రభుత్వం సబ్సిడీ 1536 లబ్ధిదారుని వాటా 389 అదనంగా జిఎస్‌టి రూ.15 వరకు ఉంటుందన్నారు. ఇది కేవలం జెర్సీ ఆవులకు వర్తిస్తుందని తెలిపారు. వైట్ రేషన్ కార్డు అర్హులని తెలిపారు. అలాగే ఈ ప్రీమియం మూడేళ్ల వరకు వర్తిస్తుందని తెలిపారు. పాలసీ జనరేట్ అయ్యి 15 రోజుల తర్వాత ఆవు మృతి చెందితే వర్తిస్తుందని అన్నారు. నాటు ఆవులకు రూ.15వేలు ప్రీమియం ఉంటే బీమా రూ.960 వీటిలో ప్రభుత్వం, సబ్సిడీ రూ.768 లబ్ధిదారుని వాటా రూ.192 జిఎస్‌టి అదనంగా ఉంటుందన్నారు. దీనిపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో పశు వైద్యాధికారి ఆర్.శంకరరావు, సిబ్బంది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భారీగా పట్టుబడిన అక్రమ మద్యం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం/ కురుపాం

సాక్షాత్తు గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ వైన్ షాప్‌కు నాలుగు అడుగుల దూరంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారని పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం రాత్రి 11గంటల సమయంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, నాటు సారా నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నా వ్యాపారులు మాత్రం చాటుమాటుగా అక్రమ మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ వైన్ షాప్ వద్ద ప్రజలకు అవసరమైన మద్యం అందుబాటులో లేకున్నా వ్యాపారుల వద్ద అన్ని రకాల బ్రెండ్లు అందుబాటులో ఉండడం విశేషం. గ్రామాల్లో బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించి దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

127 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట జంక్షన్ గుణుపూర్ రోడ్డు సమీపంలో నేతేటి ఈశ్వరరావు అనే వ్యాపారి అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారని తమకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అతని వద్ద ఉన్న 127 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ ఎస్ఐ బివి నాగభూషణరావు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఈశ్వరరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ; నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జుపాడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురుకి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం కెరడా గ్రామానికి చెందిన కె. చింటూ (17). టి.కిరణ్ (25), సాయి ముగ్గురు ఫోటోగ్రాఫర్లు. వీరు మొండెంఖల్ గ్రామానికి ఫోటోసూట్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో పి.వినోద్ (33), బి.అప్పారావు (55) బైకుపై వస్తున్నారు. గుజ్జుపాడు గ్రామ సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కె.చింటూ తలకు , టి.కిరణ్ కాలికి గాయమైంది. వినోద్ చేయి విరిగిపోయింది. అప్పారావు ముఖానికి గాయాలయ్యాయి. వీరందర్నీ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

వీరఘట్టం :మండల కేంద్రంలోని గొల్ల వీధికి చెందిన గార మోహన్‌రావు(25)పురుగుల మందు తాగి శుక్రవారం మృతి చెందారు. ఈ మేరకు పోలీసుల తెలిపిని వివరాలిలా ఉన్నాయి. ఏ పనీ చేయకుండా తిరుగుతున్నావని కుటుంబ సభ్యులు ఈనెల 6న మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అదే రోజు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు . భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి కృష్ణంనాయుడు తెలిపారు .

దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణంలోని జగన్నాథపురం కోనేరు వీధికి చెందిన వడ్డీకంచరీ గంగరాజుపై అదే గ్రామానికి చెందిన మార్న సతీష్, అతని తండ్రి కృష్ణ దాడి చేసి గాయపర్చారు. గంగరాజు ఇత్తడి పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో పాత తగువుల నేపథ్యంలో శుక్రవారం పెద్ద మనుషుల మధ్య జరుగుతున్న సంప్రదింపుల్లో ఆవేశానికిలోనై గంగరాజుపై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : పట్టణం తాళాబత్తుల వారి వీధికి చెందిన షేక్ నాగిని శుక్రవారం తన భర్త మహమ్మద్ లతీఫ్‌తో జరిగిన గొడవలు కారణంగా మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త, కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.